## క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్ ఏప్రిల్ 10: నిర్మల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాల్టీల్లో వేసవి క్రీడా శిబిరాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయుటకు ఆసక్తి గల క్రీడా సంఘాలు, పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15వ తేదీ లోగా కలెక్టర్ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని మరిన్ని వివరాలకు 9346655441 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఎస్ఐల బాధ్యత స్వీకరణ


ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న మాలిక్ రహమాన్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 10: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద ఎస్ఐగా మాలిక్ రహమాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సుమలత బదిలీపై నిర్మల్ భరోసా కేంద్రానికి వెళ్లారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మాలిక్ రహమాన్‌ను పోలీసు సిబ్బంది పూలమాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా పని చేస్తానని పేర్కొన్నారు.


ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సాయన్న

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి ఎస్ఐగా ఈ సాయన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన దుబ్బక సునీల్‌ను పోలీస్ శాఖ ఉన్నత అధికారులు నిజామబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిజామబాద్ జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఈ సాయన్నను ఇంద్రవెల్లికి బదిలీ చేశారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 10 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని కేజీబీవీని గురువారం ఎంఈవో గంగాధర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక పరీక్షలు పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, సబ్జెక్ట్ వారీగా ఎప్పటికప్పుడు ముల్యాంకనం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌వో తిరుమల, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రేషన్ దుకాణాల తనిఖీ

దస్తురాబాద్, ఏప్రిల్ 10 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం, పెరకపల్లె గ్రామాల్లోని రేషన్ దుకాణాలను గురువారం తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీలర్లను ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది, రేషన్ డీలర్ నరేందర్, లబ్ధిదారులు ఉన్నారు.

## నిరుపేదకు విద్యార్థుల ఆసరా

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 10: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని బొమ్మరేని నర్సయ్య నిరుపేద కావడంతో తినడానికి తిండి లేదు. మస్కాపూర్ ప్రభుత్వ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు కలిసి రోజు కొంచెం బియ్యాన్ని సేకరించి నెల రోజులు అయ్యాక 30 కిలోల బియ్యం, రూ. 500 ఆ కుటుంబానికి అందజేశారు. విద్యార్థులను గ్రామస్తులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేందర్, షేక్ ఇమ్రాన్, శ్రీనివాస్, అంజన్న, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 10: సైబర్ మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఎఫ్ఎల్ కౌన్సిల్ సభ్యులు భరత్‌యోగేశ్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామంలో ఎస్‌బీఐ సౌజన్యంతో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ గోవిందుల మహేశ్, సజ్జు పాల్గొన్నారు.

## 25వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఎదులాపురం, ఏప్రిల్ 10 : దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎలాంటి న్యాయం జరుగులేదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. నిషాన్‌ఘాట్, 170 సర్వే నంబర్‌లోని కాలనీకి తాగునీరు, కరెంట్, రోడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఖండాల గణేశ్, లక్ష్మి, అక్బర్ అలీ, సాగర్, 15 మంది కూర్చున్నారు.

## అంబేద్కర్ జయంతి కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

ఖానాపూర్, ఏప్రిల్ 10 : ఈ నెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఖానాపూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం విశ్రాంతి భవనంలో విడుదల చేశారు. పట్టణంలోని పాత బస్టాండు అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ తహసీల్దార్, ఎస్ఐ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్, ఎఫ్ఆర్‌వో, ఎస్‌బీఐ మేనేజర్లకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, రాజగంగన్న, సంతోష్, రాజేశ్వర్, నరేశ్, ప్రణీత్, గంగాధర్, మహిపాల్ పాల్గొన్నారు.

ఎదులాపురం, ఏప్రిల్ 10 : ఆదిలాబాద్ జిల్ల ఇంద్రవెల్లిలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో గల సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు మేకల మల్లయ్య, కోశాధికారి ప్రభాకర్, దేవన్న, అశోక్, స్వామి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్, ఏప్రిల్ 10: భవిష్యత్‌లో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్మల్ డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జౌళి గ్రామంలో వాటర్ షెడ్ యాత్ర ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం ఇప్పటి నుంచే గ్రామాల్లో ఇంకుడు గుంతలు, చెట్లు పెంచడం, నీటి కుంటలు, రాళ్ల కట్టలు, చెక్‌డ్యామ్ వంటి పనులు చేపట్టి తద్వారా నీటి కొరత లేకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలిక అహ్మద్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, తహసీల్దార్ శ్రీదేవి, ఏపీవో లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, వాటర్ షెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం
# మొక్కలు దహనం


దహనమైన మొక్కలు

కడెం, ఏప్రిల్ 10 : నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని రాంపూర్ బీట్‌లో అగ్గికి మొక్కలు దహనమయ్యాయి. ఈ రేంజ్ పరిధిలోని రాంపూర్ గ్రామంతో పాటు అక్కడ ప్రజలకు సంబంధించి వ్యవసాయ భూముల్లో మొక్కలు నాటారు. రాంపూర్ గ్రామాన్ని పునరావాసం కింద మద్దిపడగకు తరలించగా, వారి భూముల్లో పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. రాంపూర్ బీట్ పరిధిలో ఇటీవల రాజుకున్న అగ్గి వల్ల దాదాపు 20 నుంచి 30 వేల వరకు మొక్కలు దహనమైనట్లు గుర్తించారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మొక్కలు బూడిదయ్యాయి.

## లంబాడ నాయకుల ముందస్తు అరెస్టు


పోలీసుల అదుపులో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

దస్తురాబాద్, ఏప్రిల్ 10 : రాష్ట్ర కేబినేట్‌లో లంబాడ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని సీఎం ఇంటి ముట్టడికి రాష్ట్ర లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు నాగవత్ సురేశ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర కేబినేట్ లంబాడ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 10 : పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని భూత్కుర్ గొండుగూడెంలో గురువారం సీపీఐ మండల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న పోడు భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించాలని, రేషన్ కార్డులు లేని వారికి కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజు వారికి రూ. 600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు భూక్యా రమేశ్, రైతు సంఘం మండలాధ్యక్షుడు లింగన్న, రైతు కూలీ సంఘం నాయకులు మోహన్, సాగర్, కళ్యాణి, రూపాబాయ్, నూరుబాయ్, గంగు, కార్మికులు పాల్గొన్నారు.

## గడువులోగా సన్న బియ్యం పంపిణీ పూర్తి చేయాలి

ఖానాపూర్, ఏప్రిల్ 10 : ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యాన్ని రేషన్ డీలర్లు గడువులోగా లబ్ధిదారులకు అందజేయాలని ఇన్‌చార్జి డీసీఎస్‌వో కోమల్‌రెడ్డి సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ సుజాత, డీఎం సుధాకర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు, సన్న బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం సన్న బియ్యం అర్హులకు అందుతున్నాయ అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసకున్నారు. వారి వెంట రేషన్ డీలర్ సురేశ్, లబ్ధిదారులు ఉన్నారు.

## ఉన్నత చదువులకు వెళ్తున్న పీవోకు సన్మానం


డాక్టర్ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో, కార్యాలయ సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 10: ఉన్నత చదువులకు వెళ్తున్న కార్యక్రమ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డిని గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో రాజేందర్, సిబ్బంది వీడ్కోలు తెలుపుతూ సన్మానించారు. రవిందర్ రెడ్డి టీబీ, హెచ్ఐవీ, ఎయిడ్స్, లెప్రసీ, మలేరియా కార్యక్రమ నిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్య పీజీ రేడియాలజిస్ట్ చదివేందుకు వెళ్తుండడంతో సన్మానించారు. కార్యక్రమంలో పీవోలు రాజారమేశ్, శ్రీనివాస్, సౌమ్య, డిప్యూటీ మీడియా విస్తరణాధికారి రవీందర్, డీపీఎంవోలు రాజేశ్వర్, గంగన్న, సీపీఎం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్

నేరడిగొండ, ఏప్రిల్ 10 : నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. చాలా మంది రోడ్లపై నంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్నారని తెలిసి ఇటీవల తనిఖీ చేయగా 9 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాటికి నంబర్ ప్లేట్స్ పెట్టించడం జరిగిందన్నారు. వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేనిచో చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలి


కంటి అద్దాలు అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 10 : పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వర్తించే క్రమంలో బాడీ ఆన్ కెమెరాలను ధరించి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఎండాకాలం దృష్ట్యా ట్రాఫిక్ సిబ్బంది మండుటెండలో విధులు నిర్వర్తిస్తున్న కారణంగా వారికి ఎండ తీవ్రతను తట్టుకునేలా బ్రాండెడ్ కంటి అద్దాలు అందజేశారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండలో కళ్లకు రక్షణగా కంటి అద్దాలు ఉపయోగపడతాయని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, ఎస్ఐ మహేందర్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 10 : ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని 30 పడకల దవాఖానను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని వైద్యులకు సూచించారు. గర్భిణులకు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపిన ఆశా కార్యకర్తలు , ఏఎన్ఎంలకు డాక్టర్ ప్రమోద్ చంద్ర రివార్డులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆశ కార్యకర్తలు సవిత, రుక్మిణి మమతలను సన్మానించారు. అనంతరం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్‌ను డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అరవింద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు సౌమ్య, రాకేశ్, శైలజ, ప్రియాంక, అన్నపూర్ణ, జ్యోతి, లలిత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


మైదానంలా కనిపిస్తున్న తోయిగూడ పల్లె ప్రకృతివనం

# మైదానం కాదు.. ప్రకృతి వనమే ..

గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేక ప్రగతి ఆగినట్లే కనిపిస్తున్నది. గ్రామ స్వరాజ్యం ప్రశ్నార్థమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందిన పల్లె ప్రకృతివనాల్లో పిల్లలు, వృద్ధులు, సేదతీరేవారు. ఇప్పుడు వనాల ఆలనాపాలనా చూసేవారు లేక అవి ఎడారులై మైదానాలయ్యాయి. సాత్నాల మండలం తోయిగూడ పల్లె ప్రకృతివనంలో ఇప్పుడు ఒక మొక్క కనిపిస్తే ఒట్టు. కేవలం మిగిలింది బోర్డు మాత్రమే . జిల్లాలో పల్లె, పట్టణ ప్రకృతి వనాలు చాలా వరకు ఇలాగే ఉన్నాయి.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 10

## ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నేరేడిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. ఫారంఫండ్ పనులను పరిశీలించారు. కూలీల హాజరు శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట టీఏ, ఎఫ్ఏ, కూలీలు ఉన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

బోథ్, ఏప్రిల్ 10: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో రమేశ్‌సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని గురుదేవ్ నగర్, నిగిని, బాబెర తండా, మర్లపల్లి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విమల రణదివే జయంతి

ఎదులాపురం, ఏప్రిల్ 10 : శ్రమిక మహిళల సమస్యల పరిష్కరం కోసం నిరంతరం దివంగత విమల రణదివే కృషి చేశారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విమల రణదివే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్న, కిరణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న. అగ్గిమల్ల స్వామి, నవీన్, వెంకటమ్మ పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 10 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నిర్మల్ సీడీపీవో నాగమణి అన్నారు. నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ అంగన్‌వాడి కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శిశువులకు పాలిచ్చే తల్లులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయగౌరి, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, హేమలత, శ్యామల, యశోద, నర్సవ్వ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రాజెక్టు నుంచి పెన్‌గంగకు జలం


నిన్నటి వరకు వట్టిపోయిన గుబిడి శివారు పెన్‌గంగ

భీంపూర్, ఏప్రిల్ 10 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని గుబిడి, గోముత్రి, అంతర్గాం పెన్‌గంగ రేవులు ఎండలకు భూగర్భజలాలు లేక చుక్కనీరు లేక వెలవెలబోయాయి. తెలంగాణ సరిహద్దు ఆవాసాల రైతులు, మహారాష్ట్ర సరిహద్దు పెన్‌గంగ దగ్గరి రైతులు పంటలకు నీళ్లు లేక , పశువుల దాహార్తికి కష్టమై ఇబ్బందులు పడ్డారు. గురువారం మహారాష్ట్ర మాహోర్ సమీప ఇసాపూర్ ప్రాజెక్టు నుంచి దిగువనున్న మహారాష్ట్ర ఆవాసాల పంటల కోసం కొంత నీరు వదిలారు. దీంతో సమీపంలో ఉన్న గుబిడి తదితర ప్రాంతాల పెన్‌గంగకు జలకళ సంతరించుకుంది. దీంతో ఈ ప్రాంత రైతులు, మత్స్యకారుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఎగువ నుంచి వచ్చిన నీటితో పెన్‌గంగ

## జీవో 21ను రద్దు చేయాలి


బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, ఏప్రిల్ 10 : ప్రజా ప్రభుత్వం అంటూ చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి జీవో నంబర్ 21ను రద్దు చేయాలని బాసర ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. బుధవారం అదనపు బాధ్యతలకు మూకుమ్మడి రాజీనామా చేసి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు గురువారం తమ విధులను బహిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ముట్టడికి యత్నించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 ఏండ్లుగా ట్రిపుల్ ఐటీకి తాము 73 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని, పరిపాలన బాధ్యతలు అప్పగించి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ తమను రెగ్యూలర్ చేయక పోవడమే కాకుండా జీవో 21ని ప్రవేశ పెట్టి మాకు సమస్యలను సృష్టిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేదంటే బాసర ట్రిపుల్ ఐటీని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

## ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల ఎంపిక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 10 : ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కోసం( యూడీఐడీ) ఎంపిక శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం నిర్మల్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కోసం అర్హుల ఎంపిక శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరాలకు వచ్చే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు సృజన్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎదులాపురం, ఏప్రిల్ 10 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. నార్కోటిక్, పోలీసు శాఖ సూచనల మేరకు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మాదకద్రావ్యల వల్ల కలిగే అనార్థలపై వీధి నాటకం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, వినాయక్ చౌక్‌లో మత్తుకు యువత ఎలా ఆకర్షితులవుతున్నారో వారి నాటకం ద్వారా తెలియజేశారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటయ్య, అనిత పవార్, పునం పరిక్, పృధ్వీరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, ఏప్రిల్ 10 : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేల రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మనోహర్‌రావు అన్నారు. గురువారం ఆదిలాబాద్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా హాజ్ సొసైటీ ఆధ్వర్యంలో హాజ్ యాత్రికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎండబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు హాజ్ సొసైటీ తరపున సన్మానించారు. కార్యక్రమంలో హాజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, మైనార్టీ శాఖ సిబ్బంది ఎండీ కలీం, అబ్దుల్ హసిబ్ పాల్గొన్నారు.

## హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బేల, ఏప్రిల్ 10: హాస్టల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పంచాయతీ అధికారి మహేశ్ కుమార్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బేలలోని సదల్‌పూర్ మినీ గురుకులంను ఆయన తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. వంట గది చుట్టుపక్కల చెత్తాచెదారంతో ఉండడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలను పెట్టొద్దని వార్డెన్‌కు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ అరుణ్, పంచాయతీ కార్యదర్శి ఖదీర్, సిబ్బంది ఉన్నారు.

## గంజాయి పట్టివేత

ఇచ్చోడ, ఏప్రిల్ 10: ఇచ్చోడ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దేవులనాయక్ తండా(రోల్ మామడ) గ్రామంలో గురువారం విక్రయిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా జాత్వే మాన్‌సింగ్ ఇంటి ముందు 325 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని డేరా గ్రామానికి చెందిన మట్ట నందు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయి పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నందు బోథ్ మార్కెట్ వైపు వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడి గంజాయి 125 గ్రాములు ఉండగా విలువ రూ.3 వేలు ఉంటుందని ఎస్ఐ వివరించారు.

## మల్లన్న ఆలయంలో చోరీ

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 10: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామ శివారులోని అగ్గి మల్లన్న స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుడి తులుపు తాళలు పగలగొట్టి పుస్తెలు, వెండి అభరణలు, హుండీలోని డబ్బులను అపహరించారు. మొత్తం కలిపి రూ.50 వేల విలువ గల వస్తువులు దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరి మృతి

భైంసాటౌన్, ఏప్రిల్ 10 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపారు. భైంసా పట్టణం గోపాల్‌నగర్‌కు చెందిన పైడొల్ల రాజు(32) ప్రతి రోజూ మాదిరిగానే కూలీ కోసం వానల్‌పాడ్ వెళ్లి పని ముగించుకొని తిరిగి పట్టణానికి కాలినడకన వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు .

## బెల్ట్ షాపులపై దాడులు


బోథ్, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిలా బోథ్ మండలంలోని కౌఠ(బీ), ధన్నూర్(బీ) గ్రామాల్లో బెల్ట్ షాపులపై గురువారం దాడులు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కౌఠ(బీ) బెల్ట్ షాపులో 690 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.90 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ధన్నూర్(బీ)లో 587 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.1,34,000 ఉంటుందని తెలిపారు. బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఇరువర్గాలపై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 10: ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీకి చెందిన సాజీద్ మొదటి భార్యని వదిలి మరో మహిళతో ఉంటున్నాడని మొదటి భార్య, కుటుంబ సభ్యులు మరో మహిళా ఇంటి వద్ద గొడవకు దిగారు. దీంతో మావల పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు మావల రెండవ ఎస్ఐ పవార్ గౌతమ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


చింతవార్ దీపక్(ఫైల్)


సదాప్(ఫైల్)

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా(బీ), పిప్రి ఎక్స్‌రోడ్డు గ్రామాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు 108 అంబులెన్స్ సిబ్బంది ఆత్రం అశోక్‌తో పాటు ప్రత్యేక సాక్షులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఇంద్రవెల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి చింతవార్ దీపక్(58), జాలంతండా గ్రామానికి చెందిన నిస్తే అజయ్‌తో కలిసి ఆదిలాబాద్‌లో తన సొంత పనులు ముగించుకొని తీరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై ఇంద్రవెల్లికి వస్తున్నారు. మండలంలోని ధనోరా(బీ), పిప్రి ఎక్స్‌రోడ్డు గ్రామాల సమీపంలో ధనోరా(బీ)గ్రామానికి చెందిన షేక్ సదాప్(18) ఇంద్రవెల్లి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలోనే మండలంలోని ధనోరా(బీ), పిప్రి ఎక్స్‌రోడ్డు గ్రామాల సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రముఖ వ్యాపారి చింతవార్ దీపక్(58), షేక్ సధాప్(18) మృతి చెందారు. జాలంతండాకు చెందిన యువకుడు అజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నట్లు అబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయన్న ఘటన స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నా రు. మృ తదేహాలను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

## చెట్టు అమ్మను నేను


చెట్టు నీడ సేద తీరుతున్న మూగజీవాలు

ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా మూగజీవాలు సైతం తల్లడిల్లుతున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలో ఎండ వేడిని తట్టుకోలేక ఓ చెట్టు కింద గొర్రెలు, మేకలు సేద తీరాయి. మేతకు వెళ్లిన మూగజీవాలకు ఎక్కడ నీడ దొరకక పోవడంతో చెట్టు నీడను ఆశ్రయించాయి. వీటితో పాటు గొర్రెల కాపరి సైతం చెట్టు నీడ సేద తీరుతుండగా నమస్తే కెమెరా క్లిక్‌మనిపించింది. -ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 10